తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ఆగివున్న లారీని ఢీకొన్న మరోలారీ ...

### ఒకరి మృతి-మరో ముగ్గురికి తీవ్రగాయాలు ...

నాయుడుపేట టౌన్ నవంబరు 21 ప్రభాతవార్త

నాయుడుపేట మండలం పండ్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న లారీని మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్ మూర్తుజాఖాన్(58)అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది.పోలీసుల సమాచారం మేరకు.. చెన్నై నుండి లారీ మినుముల లోడ్డుతో వింజమూరుకు వెళుతుండగా మార్గమధ్యలో నాయుడు పేట మండలం పండ్లూరు వద్దకు వచ్చేసరికి పంచరు కావడంతో డ్రైవర్ లారీని రోడ్డుపక్కన ఆపి టైరుమారుస్తున్న సమయంలో అదే మార్గంలో వెనుక నుండి గూడూరు వైపు వెళుతున్న మరోలారీ ఆగివున్న లారీని ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ మూర్తుజఖాన్ అక్కడకక్కడే మృతి చెందగా క్లీనర్ జగన్,రపి,వెంకటేశ్వర్లు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిఐ బాబి తనసిబ్బందితో కలిసి ప్రమాధం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. మృతిచెందిన లారీడ్రైవర్‌ది ఒంగోలు జిల్లా మర్కాపురంగా పోలీసులు గుర్తించారు.

## శ్రీచెంగాళమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

సూళ్లూరుపేట, నవంబర్ 21 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ విఆర్‌కె కృపాసాగర్ దంపతులు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. దేవ స్థానానికి విచ్చేసిన వీరికి అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం శాస్త్రో క్తంగా పండితుల ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూ ళ్లూరుపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్, తహాశీల్దార్ ఎస్‌వి నరసింహారావు, సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.



## కొండపై హాకర్ల రాజ్యం!

### అనధికార వ్యాపారాలపై కొరఢా ఝుళిపిస్తారా!?

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి తమ కష్టాలు చెప్పుకుని మొక్కులు తీర్చుకుందామని వచ్చే భక్తులకు హాకర్ల దోపిడీ ఎక్కువైంది. ఎంతో భక్తిభావంతో...పవిత్రమైన మనసుతో తిరుమలకు చేరుకున్న భక్తులను అక్కడా ఇక్కడా అని గాకుండా కొండపై కాలుమోపగానే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌ల నుండి స్వామివారి దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన తరువాత ఆలయం పరిసరాల్లో హాకర్లు పలురకాలుగా వెంటపడి ఇబ్బందులు పెడుతున్నారు. కొండపై అనధికార హాకర్లు తమ ఇష్టారాజ్యంగా తయారై వ్యాపారాలు చేసుకునే సమయంలో భక్తుల ముందే వివాదాలు తలెత్తి గొడవలకు దిగుతున్నారు. తరచూ ఆలయం ముందు, ఆస్థానమండపం, మాఢవీధుల్లో, షాపింగ్ కాంప్లెక్స్, అన్నదానం భవనం, నందకం వద్ద హాకర్లు గొడవలు చేసుకోవడం సాధారణమైంది. గత ఐదేళ్ళలో హాకర్లు ఎక్కువై వ్యాపారాల్లో గొడవలకు దిగి హత్యాయత్నాలకు పాల్పడిన ఘటనలు జరిగాయి. ఏకంగా సిఆర్ఒ, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో కూడా హాకర్లు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హాకర్లను కట్టడిచేయడంలో టిటిడి విజిలెన్స్‌గానీ, పోలీసులు గానీ సాహసం చేయడం లేదంటే రాజకీయ ఒత్తిళ్ళు భయంతోనేననేది వాస్తవం. హాకర్లను, అనధికార హాకర్లను కట్టడిచేయాలని ఇప్పటికే టిడిపి నేతలు టిటిడి ఈఒకు ఫిర్యాదు చేశారు. తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రానికి ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. ఇలా వస్తున్నవారిలో సర్వదర్శనం భక్తులు 40వేలమందివరకు ఉంటున్నారు. ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు కలిగిన భక్తులు 25వేలమంది వరకు ఉంటారు. వీళ్ళు నేరుగా వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకుంటే సాంప్రదాయ దుస్తులు ధరించకపోతే అక్కడికక్కడే పంచలు విక్రయాలు అధికార లైసెన్స్‌ఉన్న వ్యాపారులే చేయాలి. అయితే కొందరు బినామీ పేర్లతో ఈ వ్యాపారాలు చేస్తూ భక్తులను అధిక ధరకు దోపిడీకి గురిచేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇలా ఒక్కో హాకర్ రోజుకు మూడువేల రూపాయల వరకు ఆర్జిస్తున్నట్లు అంచనా. ఇక ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులను ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామికి చేరుకునే మార్గంలో ఫోటోలతో పేరుతో అనధికార హాకర్లు, కర్పూరం, నెయ్యి ఒత్తులు,దూపందీపం అంటూ అనధికారికంగా వ్యాపారాలు చేస్తున్నారు. ఈ తతంగం అంతా విజిలెన్స్,పోలీసులకు తెలిసినా చూసీచూడనట్లు పోతున్నారనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి.

### స్నేహితులను కాపాడి

## ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి...

రేడిగుంట నవంబర్21 ప్రభాతవార్త



స్నేహితులను కాపాడబోయి తన ప్రాణాలు పోగొట్టుకున్న హేమాద్రి (20) అనే విద్యార్థి అందరిని కంటతడి పెట్టిస్తున్నాడు. ఈ సంఘటన గురువారం రేణిగుంట మండలం మామండూరు అడవిలోని ఒక నీటిమడుగులో జరిగింది. వివరాలు ఇలా తిరుపతి ఎస్వి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎనిమిది విద్యార్థులతో కలిసి హేమాద్రి ద్విచక్ర వాహనాల్లో మామండూరుకు వచ్చారు. చాలాసేపు అందరూ ఆహ్లాదంగా గడిపారు. అనంతరం నీటి గుంటలో స్నానాల కోసం దిగారు. వీరిలో ఒక్కరికి కూడా ఈత రాదు. గుంటలో దిగి కొంచెం కొంచెం ముందుకు వెళుతూ ఆనందంగా కేరింతలు కొట్టారు. గుంత లోతుగా ఉండడంతో వారిలో కొంచెం పొట్టిగా ఉన్న విద్యార్థులు నీటిలో మునిగిపోయారు. వారిని కాపాడాలని ఉద్దేశంతో హేమాద్రి లోపలికి దిగి గట్టిగా వారిని బయటకు నెట్టాడు. ఈ క్రమంలో అతను నీటి గుంటలో మునిగిపోయాడు. విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో అక్కడ ఉన్న సందర్శకులు హేమాద్రినీ బయటకు తీశారు. అప్పటికే హేమాద్రి కొన ఊపిరితో ఉన్నాడు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మిత్రులందరు అతన్ని ద్విచక్ర వాహనంపై దగ్గరలోని అమర ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సీఐ శరత్ చంద్ర ఆదేశాలతో ఎస్సై అరుణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కెబిఆర్‌పురంలో విప్పకుంట దురాక్రమణ

### పట్టించుకోని రెవెన్యూ అధికారులు





విప్ప కుంటలో నిర్మించిన భవంతి, గాలేరు - నగరి కాల్వ స్థలంలో నిర్మించిన అంగడి

పుత్తూరు, నవంబరు 21 ప్రభాతవార్త :

*గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో పుత్తూరులో కుంట పోరంబోకు భూములు యధేచ్ఛగా ఆక్రమ ణలకు గురయ్యాయి. మండలం లోని కెబిఆర్ పురం గ్రామంలో స్థానిక వైసిపి నాయకుడు కుంట స్థలం ఆక్రమించి భవంతిని నిర్మించారు. ఇదే రెవెన్యూ గ్రామ పరిధిలో మరో వైసిపి నాయకుడు గాలేరు - నగరి కాల్వకు చెందిన స్థలాన్ని ఆక్రమించి ఒక అంగడి నిర్మించి వ్యాపారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వైసిపి అగ్ర నాయకులు హుకుం జారీచేస్తే... చిత్తం హుజూ రంటూ పనిచేసిన గత తహాశీల్దార్లు ఈ ఆక్రమ ణలను చూసీచూడనట్టుగా వదిలేశారు. అదే విధం గా ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల వద్ద లం చాలకు అలవాటుపడిన గత తహాశీల్దార్లు కుంట స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని సు ప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కూడా బేఖాతరు చేసి పరోక్షంగా ఆక్రమణలకు సహకారం అందించారు.*

కెబిఆర్ పురం గ్రామంలో సర్వే నెంబరు 128/2లో 2.08 ఎకరాల్లో దిగువ విప్ప కుంట వుంది. దశాబ్దాలుగా స్థానికులకు జీవనాధారమైన పాడి పశువుల పెంపకానికి ఈ కుంట ఉపయోగ పడుతోంది. గ్రామస్తులు సుమారు 500కు పైగా పశువులను పెంచుతున్నారు. పశువులు నీళ్లు తాగడానికి, వాటిని శుభ్రం చేయడానికి కుంటను వినియోగిస్తున్నారు. వీరితో పాటు మేకలు, గొర్రెలు పెంపకందారులు ఈ కుంటపైనే ఆధారపడు తున్నారు. ఈ కుంటకు ఎగువన ఎగువ విప్ప కుంట వుండేది. కాలక్రమంలో ఆ కుంట పూడుకు పోయిన నేపథ్యంలో దిగువ విప్ప కుంట స్థానికు లకు దిక్కయింది. ఈ పరిస్థితుల్లో గత వైసిపి పాలనలో నాయకుల కన్ను ఈ కుంటపై పడింది. దాంతో కుంటలోని దాదాపు 15 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి విలాసవంతంగా ఒక భవనం నిర్మించా రు. ఆక్రమణలకు తోడుంటే బాగుంటుందని అనుకున్నారేమో...మరికొందరు కూడా ఈ భవంతి పక్కనే కుంట స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. అసలు కుంటలోకి నీరు రాకుండా చేసేస్తే...మొత్తం ఆక్రమించవచ్చనే దురాలోచనతో కొంత మంది ఈ కుంటకు నీరు ప్రవహించే సప్లయి కాల్వలను ఆక్రమించారు. పర్యవసానంగా స్థానికుల పశువుల పెంపకందారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో సమస్య తీవ్రత మరింత అధికమవుతోంది. గ్రామంలో గాలేరు - నగరి కాల వకు చెందిన స్థలాన్ని ఆక్రమించి ఒక అంగడి నిర్మిం చి వ్యాపారం చేస్తున్నారు. కళ్ల ముందే ఆక్రమణలు జరుగుతున్నా గ్రామ స్థాయిలో పనిచేసే విఆర్వోలు గాని, తహాశీల్దారుగాని ఏ మాత్రం పట్టించుకోలేదు. వైసిపి ప్రభుత్వం పోయి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చినా రెవెన్యూ శాఖాధికారులు గత ప్రభుత్వంలో మాదిరి గానే వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి చర్యలు చేపట్టకపోతే మిగిలిన కుంట భూములు కూడా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం

## ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహిస్తాం



### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 21: ప్రభాతవార్త

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో ఆక్వారంగాన్ని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేస్తామని, ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా మత్స్య శాఖ వారు నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవం కార్యక్రమంలో పలు మత్స్యకార సంఘాల నాయకులు, ఆక్వా సాగు రైతులు, హ్యాచరీ ప్రతినిధులు హాజరవగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు ఆక్వా, మత్స్య పలు అంశాలపై సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆక్వా రైతులను దృష్టిలో పెట్టుకొని దేశవ్యాప్తంగా మన రాష్ట్రంలో ఎక్కువ ఉత్పత్తులు ఉంటూ ఎగుమతిలో ముందుందని తెలిపారు. తిరుపతి జిల్లా మత్స్యకారులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మత్స్యకార భరోసా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఆంధ్ర ప్రదేశ్ మత్స్యశాఖ కమిషనర్ విజయవాడ వారి సూచనల మేరకు 03.05.2024న బోట్ల గణన నిర్వ హించబడిందని తెలిపారు. జిల్లాలో 880 బోట్లు, 4203 మంది సిబ్బంది ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ మ్యానిఫెస్టో ప్రకారం, చేపల వేట నిషేధ కాలంలో సముద్ర మత్స్యకారుల కుటుంబాలకు రూ.10,000ను పెంచి రూ.20,000 చేయడానికి కట్టుబడి ఉందని, తద్వారా జిల్లాలో మత్స్యకార భరోసా పథకం కింద 3786 మంది లబ్ధిదారులకు రూ.7.57 కోట్లు మత్స్యకార కుటుంబాలకు ఆర్థికంగా సహాయమందించడం మరియు జీవనోపాధి మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్ రాష్ట్ర పండుగగా అటవీ, పర్యాటక మరియు మత్స్య శాఖల సమన్వయంతో ఘనంగా సంబరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల మధ్యన పులికాట్ సరస్సు నందు చేపల వేటపై మత్స్యకారుల మధ్యతలెత్తిన వివాదంపై జిల్లా కలెక్టర్ గా పక్కన రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్ ఎస్పీతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని సదరు వివాద శాశ్వత పరిష్కారానికి త్వరలో చర్యలు చేపట్టబో తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు పవర్ సబ్సిడీ పై త్వరలో ప్రభుత్వం నుండి అందే మార్గదర్శ కాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లో ఓల్టేజి కరెంటు సమస్యపై ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో సమావేశం నిర్వహించి తగిన సామర్థంతో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు, కోట మండలం రాచ గన్నేరు వద్ద అవసరం మేరకు సబ్ స్టేషన్ ప్రపోజల్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరుగుతుం దని, పరిశ్రమలకు కరెంటు సమస్య పరిష్కారానికి ఏపీ ట్రాన్స్ కో ద్వారా జిల్లాలో రెండు సబ్ స్టేషన్ లకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా మత్స్యకార రంగానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఆ దిశలో చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అనంతరం పలువురు ఆక్వా, మత్స్యకార సాగు రైతులకు నేతలకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, ఫిషరీస్ డెవలప్మెంట్ అధికారులు, జిల్లా అధ్యక్షులు మత్స్యకార సహకార సంఘం జివిరత్నం, పులికాట్ సరస్సు మత్స్యకారుల సంఘం బొమ్మన శ్రీధర్, హేచరీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాగర్ రెడ్డి, మత్స్య, ఆక్వాసాగు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

### కేవీబీ పురం మండలంలో

## దొంగలు పడ్డారు

### మఠం కావమ్మగుడిలో కిరీటం, హారం, నగదు దోపిడి
### ఓ ఇంట్లో లక్ష నగదుతో పాటు వెండీ దీపాలు అపహరణ


కేవీబీ పురం, నవంబరు 21 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలో దొంగలు పడ్డారు. ఎంఏ రాజులకండ్రిగ, మఠం గ్రామాల్లో రూ.10 లక్షల వరకు నగదు, వెండి వస్తువులు బంగారు వస్తువులు అపహరణకు గురవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న నారాయణవనం రూరల్ సీఐ రవీంద్ర, కేవీబీ పురం ఎస్ఐ ఓబయ్య ఘటనా స్థలాలను పరిశీలించి గ్రామస్తుల ద్వారా వివరాలు సేకరించారు. క్లూస్ టీం దొంగతనం జరిగిన వనమాలినాయుడు ఇంటిలో క్షుణ్ణంగా వివరాలు సేకరించారు. అదే విధంగా మఠంలోని కావమ్మ మారయ్య దేవాలయాన్ని పరిశీలించి క్లూస్ టీం వివరాలు సేకరించారు. ఈ దొంగతనంలో మఠం కావమ్మ దేవాలయంలో హుండీ పగులగొట్టి డబ్బులు కాజేశారు. అదే విధంగా కావమ్మకు సంబంధించిన బంగారు కిరీటం హారం, చైన్ ఇతర నగలు చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అదే విధంగా వనమాలినాయుడు మాట్లాడుతూ బీరువా పగులగొట్టి లక్ష రూపాయలు నగదుతో పాటు వెండి దీపాలు, దొంగతనానికి గురై నట్లు తెలిపారు. వ్యవసాయ పొలాల వద్ద ఇల్లు నిర్మించుకుని అప్పుడప్పు వచ్చి పోయే వాళ్ళమని ఆయన తెలిపారు. అలాగే మంగళవారం రాజులకండ్రిగ ఎస్సీ కాలనీలో రాత్రి 2 గంటల సమయంలో ఇద్దరు అనుమానితులు ఉండడంతో గమనించిన కాలనీ వాసులు వెంటపడడంతో అరుంధతివాడ మీదుగా దూరి వ్యవసాయ పొలాల్లో దూరంగా ఉన్న వనమాలినాయుడు ఇం టిలో దొంగతనం చేసి తరువాత మఠం చేరుకుని గ్రామస్తుల కంటపడకుండా ప్రభుత్వ పాఠశాల గేటు తెరచి లోపలనే వచ్చి చెట్టు ఎక్కి కావమ్మ గుడిలో ప్రవేశించి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు గ్రా మస్తులు తెలిపారు. ఒకే రోజు రెండు గ్రామాల్లో దొంగతనం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

### తిరుమల తరహాలో

## బ్రహ్మోత్సవాలు

### పంచమితీర్థానికి విస్తృతంగా ఏర్పాట్లు : టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుచానూరు, నవంబర్ 21, ప్రభాత వార్త

తిరుమల తరహాలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని తితిదే ఈఓ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో గురువారం సాయంత్రం ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచమి తీర్థం రోజు భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హోల్డింగ్ పాయింట్లలో ఉండే వేచి ఉండే భక్తులకు సౌకర్యవంతంగా మంచినీరు, అల్పాహారంతో పాటు మ రుగుదొడ్లను కూడా అందుబాటులో ఉంచేందుకు ముందస్తుగానే ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### ఇద్దరి పరిస్థితి విషమం



*కుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త*

*కుప్పం పట్టణం కమతమూరు క్రాస్‌లో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు టు వీలర్‌ను ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారినట్లు సమాచార ం. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం మండలం కొత్తపల్లి పంచాయతీ సజ్జలపల్లికి చెందిన రవి, రమేష్, తంగమ్మ అనే మహిళ ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. అయతే కమతమూరు క్రాస్ వద్ద అదే మార్గంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు టువీలర్‌ను ఢీకొంది. దీంతో టు వీలర్‌లో వస్తున్న రవి, రమేష్, తంగమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. రవి, రమేష్‌లకు కాళ్లు విరిగిపోయాయి. చికిత్స నిమిత్తం ముగ్గుర్ని ఆస్పత్రికి తరలించారు. కాగా రవి, రమేష్‌ల పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.*

# అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్యేలు

## కుంకీ ఏనుగులతో సమస్య పరిష్కారం

### -ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు,నవంబర్ 21,ప్రభాతవార్త:

పలమనేరు నియోజకవర్గంలో ఏనుగుల దాడులలో జరుగుతున్న ప్రాణ, ఆస్థి,పంట నష్టాలపై పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం జరిగిన అసెంబ్లీలో గళం వినిపించారు.ఎన్నో ఏళ్లుగా పలమనేరు నియోజకవర్గంలో అటవీ సమీప ప్రాంతాలలోని రైతులు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్య ఏనుగుల దాడులు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అసెంబ్లీలో సమస్యపై ప్రస్తావిస్తూ నియోజకవర్గంలో ఏనుగుల నియంత్రణకు కర్నాటకలో ఉన్న కుంకీ ఏనుగులను తీసుకువచ్చి అటవీ ప్రాంతంలోని ఏనుగులను నియంత్రించవచ్చని,కుంకీ ఏనుగుల నిర్వహణకు పలమనేరులోని 20 హెక్టార్ల భూమి గతంలోనే ప్రభుత్వం గుర్తించిందని,అటవీశాఖ భూములు జాతీయ రహదారులకు పోవడంతో వచ్చిన నిధులతో కుంకీ ఏనుగుల సంరక్షణ చేపట్టవచ్చుని, దీంతో ఒకవైపు అటవీ ప్రాంతం నుండి వచ్చే ఏనుగులను నియంత్రించడంతోపాటు కుంకీ ఏనుగులను సంరక్షించే ప్రాంతాని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చని ఆయన అసెంబ్లీలో ప్రస్తావించారు.దీనిపై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గతంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది.

## చెరుకు రైతులకు న్యాయం చేయండి

### నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



నిండ్ర,నవంబరు 21 ప్రభాతవార్త :

నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ చెరుకు రైతులకు చెల్లించవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జీరో అవర్‌లో ప్రస్తావించారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్‌లో నగరి నియోజకవర్గం నిండ్ర నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ యాజమాన్యం రైతుల బకాయిలు రూ.37 కోట్లు, ఉద్యోగులకు 12 కోట్లు బకాయిలు పెట్టారని, వీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టి రైతులకు న్యాయం చేయాలని అన్నారు.బకాయిలు విషయంగా రైతులు,ఉద్యోగస్తులు గత నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నారని కానీ రైతులకు న్యాయం జరగలేదని దీని వలన ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ వేలంకు వచ్చిందని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

## తుమ్మలగుంట చెరువుకు తుడా నిధుల దుర్వినియోగం

### అసెంబ్లీలో ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రస్తావన



తిరుపతిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త:

సుందరీకరణ పేరుతో తుమ్మలగుంట చెరువుకు కోట్ల రుపాయాలు తుడ నిధులను వెచ్చించి, దుర్వినియోగం చేసారని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. తిరుపతిరూరల్ తుమ్మలగుంట చెరువులో ఆక్రమణలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రస్తావించారు. దళవాయిపల్లి చెరువు నుండి పేరూరు చెరువుకు, పేరూరు చెరువు నుండి తుమ్మలగుంట చెరువు, తుమ్మలగుంట చెరువు నుండి అవిలాల చెరువుకు అవిలాల చెరువు నుండి తిరుచానూరు చెరువుకు కాల్వలు ద్వారా నీరు వెళ్ళతాయన్నారు. తుమ్మల గుంట చెఱువు సుందరీకరణ పేరుతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.60కోట్ల రుపాయాల తుడ నిధులను స్వంత నిధులా! వెచ్చించారన్నారు. తిరుపతిరూరల్ మండలంలో నీటి సమస్య అధికంగా ఉందని, తుమ్మలగుంట చెఱువు ఆయకట్టు సుమారు 118 ఎకరాలని, చెరువు, చెరువు తట్టుతో కలిసి 143 ఎకరాలని, చెరువును యధావిధిగా చెఱువుగానే ఉంచితే చుట్టుపక్కల గ్రామాలకు నీటి దాహార్తి తీరుతుందన్నారు. మంత్రి నారాయణ స్పందిస్తూ బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నానికి హామీ ఇచ్చారు.

# గూడూరు డివిజన్

## మత్స్యకారులకు భరోసా ఏది బాబూ : మాజీ ఎమ్మెల్యే




తడ, నవంబర్ 21 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినప్పటికీ సూపర్‌సిక్స్ పథకాలు అమలు కావడం లేదని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం ఆయన తడ మండలం బోడిలింగాలపాడులోని ఒక హోటల్‌లో తడ మండల నాయకులు, పులికాట్ జాలర్ల ప్రతినిధులతో మాట్లాడారు. మత్స్యకారులకు వేట లేని సమయంలో నెలకు రూ.10 వేలు నుంచి రూ.20 వేలకు భరోసా పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ కె.ఆర్ముగం, ఉపమండల అధ్యక్షుడు రమేష్, జాలర్ల నాయకులు రాజేంద్రన్, చిన్నప్పయ్యన్, పలువురు మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో హుండి లెక్కింపు



చిల్లకూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని కలవకొండ గ్రామంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో గురువారం ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో హుండి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆరు నెలలకు సంబంధించి భక్తులు వేసిన కానుకలు 3 లక్షల 28వేల 13 రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ బాబు ఈఓ రవికుమార్, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్



సూళ్లూరుపేట, నవంబర్ 21 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు పెద్దన్నగారి చెరువులో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్కర సమయాల్లో తాము చేసే సేవలపై ప్రజలకు, ఇతర శాఖల అధికారులకు అవగాహన కల్పించడానికి ఇటువంటి మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్ సుమన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ శాఖల అధికారులు, కోటపోలూరు ప్రాంత ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. తహశీల్దార్ ఎస్వి నరసింహారావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తికి... ప్రత్యేక చర్యలు

-సింహపూరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ భాస్కర రావు



గూడూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : విద్యార్థిని విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భాస్కరరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎస్కెఆర్ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న విక్రమ సింహపురి ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. గూడూరు పట్టణంలోని ఎస్కెఆర్ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న విక్రమ సింహపురి ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భాస్కరరావు విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో సుమారు వంద కళాశాలలు ఉండగా అతి తక్కువ సంఖ్యలో ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్లో క్రీడాకారులు పాల్గొనడం బాధాకరంగా ఉందని అందువల్ల విద్యార్థుల్లో ఉన్న క్రీడ ఆసక్తిని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన టోర్న మెంట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూని వర్సిటీ రిజిస్టర్ సునీత, కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ అధ్యాపకులు నారాయణ రాజు వెంకట్రాయలు, వెంకటేశ్వర్లు, శ్రీధర్మ శర్మ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నరసింహస్వామి ఆలయం అభివృద్ధికి నిధులివ్వండి : ఎమ్మెల్యే



వెంకటగిరి, నవంబర్ 21 ప్రభాతవార్త : నియోజకవర్గం లోని రాపూరు మండలంలో ఉన్నటువంటి శ్రీపెను శీలలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి నిధులివ్వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. పెంచలకోన క్షేత్రం ఎంతో ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. ఈ దేవస్థానంకు నెల్లూరు రాయలసీమ, ప్రకాశం జిల్లాల నుండే కాకుండా వివిధ రాష్ట్రాలనుండి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. స్వామి వారి దేవస్థానంకు సంవత్సరంకు 12కోట్ల, కోటి రూపాయలు రాబడి ఉంటుందని చెప్పారు. దేవస్థానంకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. దేవస్థానం తరుపున వసతిగృహాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆదురుపల్లి పెంచలకోనకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కొండపై నుండి వచ్చే జలపాతంకు చెక్ డ్యామ్, పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్లారు.



**డైరెక్టర్ పదవిని తిరస్కరించిన నాగేశ్వరరావు :** యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు తిరస్కరించారు. ఈ పదవి పట్ల ఆయన తిరస్కరించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్గా నరసింహ యాదవ్‌ను ప్రభుత్వం నియమించింది. గంగోటి నాగేశ్వరరావు పార్టీ కోసం ఎంతగానో శ్రమించాడని ఆయనకు తగు ప్రాధాన్యత దక్కడం లేదని ఆయన అనుచరులు ఆవేదన చెందారు. పార్టీ స్థాపించినప్పటి నుండి ఆయన ఎంతగానో పార్టీ కోసం కృషి చేశారని వారు తెలిపారు.

## ఉసిరి చెట్టుకు పూజలు... వన భోజనాలు



డక్కిలి, నవంబరు21 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన స్తంభాలగిరీశ్వరయ్య స్వామి ఆలయంలో గురువారం డక్కిలి తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు అధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి హోమ గుండం నిర్వహించారు. మధ్యాహ్న వన భోజనాలు చేశారు. పలువురు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లు, రెవిన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## డీలర్లు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



డక్కిలి, నవంబరు21 ప్రభాతవార్త : మండలంలో పని చేస్తున్న రేషన్ షాపు డీలర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. రెవిన్యూ కార్యాలయంలో గురువారం డీలర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో డీలర్లు రేషన్ కార్డుదారులకు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. దుకాణాలకు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. సరుకులు పంపిణీలో ఎటువంటి అవతవకలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధీర్‌బాబు, డీలర్లు పాల్గొన్నారు.

## ట్రాక్టరుతో డ్రమ్ సీడర్ వరి సాగు సులభతరం



వెంకటగిరి, నవంబర్ 21 ప్రభాతవార్త : ట్రాక్టర్‌తో డ్రమ్ సీడర్‌ని ఉపయోగించి వరి విత్తనం సులభతరం అని వ్యవసాయ పరిశోధన స్థానం ఇంజనీరింగ్ శాఖ అధిపతి డాక్టర్ సి రమణ తెలిపారు. ట్రాక్టరుతో పనిచేయు డ్రమ్ సీడర్‌తో వరి విత్తడం ప్రయోగాత్మకంగా చేపట్టడం జరిగినది. ఇది రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ ఇంజనీరింగ్‌శాఖ అధిపతి డా. సి.రమణ అద్వర్యంలో వెంకటగిరి మండలం యాచసముద్రం గ్రామంలో చేపట్టడం జరిగింది. యాచసముద్రంలోని సుబ్రహ్మణ్యం అనే రైతు పొలంలో ట్రాక్టర్ డ్రమ్ సీడర్ వరి విత్తడం జరిగిందని వెంకటగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగార్జున సాగర్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి. సుజాత, ఏ ఈ ఓ రామ్మోహన్, వి ఏ ఏ సుమతి, గ్రామరైతులు పాల్గొన్నారు.

## టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రేసులో సిసింద్రీ



వెంకటగిరిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త: తెలుగు నాడు విద్యార్థి విభాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న శ్రాణవ్‌గోపాల్‌కు ఇటీవల నామినేట్ కమిటిలో హెూదా చైర్మేన్‌గా అతని అవకాశ కల్పించారు. అయితే గత 16 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి ప్రస్తుత ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమ కార్యక్రమాలు చేయడంతో పాటు వెంకటగిరి నియోజకవర్గంలో యాదవ కమ్యూనిటీ పార్టీకి సేవలు అందించడంతో పాటు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పదవులల్లో ఎంతో మంచి పేరు ప్రఖ్యాతులు పొంది తెలుగు దేశం పార్టీ కోసం ఎంతగానో శ్రమించారు. అయితే తెలుగు దేశం పార్టీ పేద్దలు సిసింద్రీ యాదవ్ కష్టనికి పలితంగా టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంపిక చేస్తారని వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు రాష్ట్రంలో బిసి సంఘల నాయులు ఎదురుచూస్తున్నారు.

## ట్రాపిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

వెంకటగిరిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త: పట్టణం పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలు నడపాలని అదేవిదంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగిస్తే చట్ట రీత్య చర్యలు తప్పవని వెంకటగిరి ఎస్ఐ జి.సుబ్బారావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లడుతూ అటో డ్రైవర్లు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలని అదేవిదంగా అధికంగా ప్రయాణీకులను ఎక్కించు కుంటే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. అదే విధంగా పేకాట, కోడి పందెలుపై కూడా పోలీసులకు 9440796349 సమాచారం తెలియజేయాలని స్థానికులు పోలీసులు సహకారం అందిచాలని తెలిపారు.

## ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌కు సన్మానం



సూళ్లూరుపేట, నవంబర్ 21 ప్రభాతవార్త : ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బిజెపి సీనియర్ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని గురువారం సూళ్లూరుపేటకు చెందిన పలువురు నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. సురేష్‌రెడ్డిని సన్మానించిన వారిలో బైరి పార్థసారధిరెడ్డి, రాచర్ల కృష్ణమూర్తి, గండవరం సురేష్‌రెడ్డిలు ఉన్నారు.

## విస్తరణ సరే.. పరిహారం మాటేంటి!

కోట, నవంబర్ 21 ప్రభాతవార్త : సాగరమాల రహదారి నిర్మాణం నిమిత్తం భూ సేకరణ చేపట్టారు. రైతులకు చెల్లించాల్సిన నగదు వారి ఖాతాలో జమ చేయకుండానే రోడ్డు పనులు మాత్రం చురుగ్గా సాగిస్తున్నారు. మండలంలోని సాగరమాల రోడ్డు పనులు గత కొంత కాలం నుంచి రుద్రవరం, నుంచి నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామాల మీదగా పనులు జరుగుతున్నాయి. రైతులు అధికారులు చూట్టు ప్రదక్షిణులు చేస్తున్నా తమ మొర అలకించేవారు లేకుండా పోయారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగరమాల రహదారి విస్తరణ నేపద్యంలో వివిధ గ్రామాల్లో భూమలు కొల్పోయిన రైతులు తమకు ప్రభుత్వం నుంచి పరిహారం ఎప్పుడు దక్కుతుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు. నెలలు గడుస్తున్న ఇప్పటికి పరిహారం ఇవ్వలేదని కొత్తపాళెం గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. రైతులుతో మాట్లాడేందుకు తహిశీల్దార్ కె.జయ జయరావు కొత్తపాళెం గ్రామంకు వేళ్లారు . రైతులుతో మాట్లాడారు. రైతులు వద్ద ఉన్న డ్యాకుమెంటన్లు తీసుకుని విచారణ జరుపుతున్నారు.

## 24 కార్తీక వన భోజన మహోత్సవం



కోట, నవంబర్ 21 ప్రబాతవార్త : కోటలోని కోటమ్మ ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఈ నెల 24న వనభోజన మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ శ్రీమహా గణపతి, శ్రీసుబ్రహ్మణస్వామి, నాగేంద్రడు శ్రీ వైష్ణవి దుర్గాదేవీ శ్రీగంగమ్మ తల్లి, శ్రీమాతమ్మ తల్లి శ్రీ స్వామి శ్రీభవాని శంకర స్వామికి విశిష్ట పూజలు శ్రీకంద కూరి సుధాకర్‌స్వామి చేతుల మీదగా జరుగుతాయన్నారు. రుద్రాభిషేకం, గోపుజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నాభిషేకం జరుగుతుందన్నారు. రాత్రి ఏడు గంటలకు పల్లకి సేవ శివనామ స్మరణలతో వైభవంగా కార్యక్రమాలు నిర్వహించండం జరుగుతుందన్నారు.

## వ్యక్తి అదృశ్యం!



గూడూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : గూడూరు మండల వెండోడు గ్రామానికి చెందిన యనమల వెంకటేశ్వర్లు సోమవారం పొద్దున్న నుండి బహిర్భూమికి అని చెప్పి వెళ్లి మరలా ఇంటికి తిరిగి రాలేదు. గ్రామంలోకి వెళ్ళాడేమో అని సాయంత్రం దాకా ఎదురు చూసి ఇంటికి రాకపోయేసరికి రెండు రోజులు తమ బంధువులు ఇళ్లకి వెళ్ళాడేమో అని విచారించినా, ఆచూకీ తెలియకపోవడంతో గురువారం యనమల వెంకటేశ్వర్లు భార్య యనమల వెంకటరమణమ్మ, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో తన భర్త కనిపించలేదు అని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 7993671889, 9515758021 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

## 26న ధర్నా జయప్రదం చేయండి : సిపిఐ



గూడూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : ఈనెల 26వ తారీఖున చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురువారం గూడూరు టవర్ క్లాక్ వద్ద కరపత్రాలు విడుదల చేసారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యావత్తు ప్రజానీకం పోరాటాలకు సన్నదం కావాలి అని కూటమి ప్రభుత్వం శరవేగంగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీరాములు, సీపీఎం పట్టణ కార్యదర్శి కాలేశా, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు చంద్రయ్య, రైతు సంఘం జి రమేష్ రైతు పార్దయ్య మునిరత్నం నాయుడు, సీపీఎం ముత్యాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ధనుంజయ్ గౌడ్‌కు ఘన సన్మానం



చిల్లకూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : చిల్లకూరులోని సీనియర్ టిడిపి నాయకులు పంది ధనుంజయ్ గౌడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా గురువారం చిల్లకూరులోని ఆయన నివాసంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ, మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి, తిరుపతి జిల్లా పార్లమెంట్ కార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ధనుంజయ గౌడ్ కు శుభాకాంక్షలు తెలియజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బెల్లంకొండ రాజేంద్ర, నాయకులు జానకిరామ్ రెడ్డి, నావూరు సుబ్బయ్య, కొట్టు సురేష్, బాల రమణయ్య, బెల్లంకొండ మల్లికార్జున, నవీన్, వేంపులూరు శ్రీనివాసులు, గూడూరు నియోజకవర్గ గౌడ్ సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీ



చిల్లకూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : తమ్మినపట్నం సచివాలయ కార్యాల యంలో 60 సంవత్సరాలు వయస్సు గల 50 మందికి భౌతిక సహాయాలు, ఇతర సహాయక పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీల్ చేర్స్, వాకర్ స్టాండ్, ట్రైపాడ్ స్టిక్, వాకర్ స్టిక్, బ్లైండ్ స్టిక్, నెక్ బెల్ట్, వైస్ట్ బెల్ట్ మరియు హియరింగ్ మెషీన్లు వంటి పరికరాలు పంపిణీ చేశారు. జిందల్ పవర్ లిమిటెడ్ సిఎస్ఆర్ టీమ్ ఆధ్వర్యంలో, ప్రధాన కార్యాలయ హెడ్ కే. శ్రీనివాస్ రావు, లైజనింగ్ విభాగం అధికారి ఖలీద్ కంపోజిట్ రీజియనల్ సెంటర్ నుండి కృష్ణ, ప్రభీన్, జనార్ధన్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని శుభారంభించారు. ముఖ్య అతిథులుగా తమ్మినపట్నం సర్పంచ్ ఎన్. సుబ్రమణ్యం, కొత్తూరు మండల కాపు శ్రీనివాసులు, పాతూరు మండల కాపు భక్తాని వెంకటేశ్వర్లు , హరిజనవాడ కాపు కొటయ్య, స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు.

## సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



గూడూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గం తీర ప్రాంతాలైన చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బ, వాకాడు మండలం జమీన్ కొత్తపాలెం, కొండూరుపాలెం గ్రామాల అభివృద్ధి కొరకు 4 కోట్ల 14 లక్షల రూపాయిలు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలసి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## కళ్ళ ముందే ఆక్రమణలు... అధికారులకు కనబడలేదా!




శ్రీకాళహస్తి, నవంబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులు, పోలీసులు, మున్సిపల్ అధికారులు సన్నిధి వీధిలో బతుకుజీవనం కోసం దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న పందిళ్ళను తొలగించటంలో చూపి శ్రద్ధ పట్టణ నడిబొడ్డులో రాజగోపురం ఎదురుగా గాంధీబొమ్మ, బస్‌స్టాప్ మధ్య కొందరు వ్యక్తులు ఎంచక్కా కట్టడాలకు పోల్స్ నాటితే కనబడక పోవటం దారుణమన్న విమర్శలు చోటు చేసుకున్నాయి. ఈ కట్టడాన్ని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ పరిశీలించారు. ఇక్కడ ఐరన్‌రాడ్స్ ఏర్పాటు చేసి కాంక్రీట్ పద్దతిలో పది పోల్స్ నాటి కట్టడం చేపడితే దేవస్థానం సెక్యూరిటి సిబ్బంది, హోంగార్డులు, ఇంజనీరింగ్ సిబ్బందికానీ డిసిబి సిబ్బంది కానీ ఎవరు అక్కడ ఆపక పోవటం చూస్తుంటే బాధాకరంగా ఉందని అంజూరు తారక శ్రీనివాసులు గురువారం ధ్వజమెత్తారు. ఇప్పటికైనా శివయ్య ఆస్తుల్ని నడివీధిలోనే కాపాడు కోకుంటే భవిష్యత్తులో ఏ రక్షణ ఉంటుందనే చర్చ చోటు చేసుకుంది.

## గురుకులంలో జిల్లా కలెక్టర్‌చే ఆకస్మిక తనిఖీ



రామకుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త : రామకుప్పంలోని డా॥ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గురుకులం అపరిశుభ్రంగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. కాగా గురుకుల పాఠశా లకు అదనపు భవనాలు మంజూరు చేయాలని ఎస్ఎంసి ఛైర్మన్ సుబ్బన్న కలెక్టర్‌ను కోరగా తగు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రామకుప్పంలో నూతనంగా వేస్తున్న సిమెంట్ రోడ్ల పనులు పరిశీలించారు. విజలాపురం వద్ద ఎయిర్‌పోర్ట్ భూములను సైతం కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమాల్లో కడ పి.డి. వికాస్ మర్మత్, పిఆర్ డిఇ గురవారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు సీతాపతి, వెంకటరమణ, నవీన్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## నైట్ షెల్టర్‌ను పరిశీలించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 21 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని పట్నూల్ వీధిలో గల రాత్రి బస కేంద్రం (నైట్ షెల్టర్)ను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం రాత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కేంద్రంలో కల్పిస్తున్న మౌళిక వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పలువురిని పలకరించి ఎక్కడ నుండి వచ్చారు, కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, మెప్మా సి.ఎం.ఎం. కృష్ణవేణి, హెప్ సంస్థ ప్రతినిధి కవిత, తదితరులు ఉన్నారు.

## డబ్బును మోసం చేసే ఆన్‌లైన్ స్కామ్ : జిల్లా ఎస్పీ




తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 21 ప్రభాతవార్త : డిజిటల్ అరెస్ట్ అనేది బాధితులు కష్టపడి సంపాదించిన డబ్బును మోసం చేసే ఆన్‌లైన్ స్కామ్ అని ఎస్పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ స్కామర్లు బాధితులను బెదిరించి, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు, వారు తరువాత డబ్బును డిమాండ్ చేస్తారు. చెల్లింపు చేయడానికి వారిపై ఒత్తిడి తెస్తారు, భాధితుడిని ఫోన్ ముందు నుండి కదలకుండా టెన్షన్ పెట్టి తమ పని కానిచ్చుకుంటారు. ఇలాంటి కేసులు పెరుగుతూ ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సైబర్ మోసాల్లో డబ్బులు పోయిన తర్వాత తిరిగి మొత్తం తీసుకురావడం కష్టతరం అవుతుంది మోసం జరిగిన వేంటనే ప్రియ్యాదు చేస్తే రికవరి శాతం ఉంటుంది. కాబట్టి పోవడానికి ముందే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మోసాలకు గురికాకుండా ఉండాలంటూ సూచనలు జారీ చేస్తున్నారు. వీడియో కాల్ వస్తె ఎట్టిపరిస్థితుల్లో కూడా స్పందించకూడదని అవసరమైన సమయంలో సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాకుండా డైల్ 112 లేదా పోలిస్ వాట్స్ అప్ నెంబర్ 80999 99977 లకు కూడా ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు కోరారు.

## రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచండి

శ్రీకాళహస్తి, నవంబర్ 21 ప్రభాతవార్త : మేర్లపాక-మల్లిమడుగు రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలని, లిఫ్ట్‌ఇరిగేషన్ పైప్‌లైన్ పనులను కాంట్రాక్టర్లు సత్వరం చేపట్టి పూర్తి చేయుటకు వత్తిడి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ ఇరిగేషన్ అదికారులకు దిశ దెశ నిర్దేశం చేసారు. తెలుగుగంగ ఎస్ ఇ మదనగోపాల్‌ను ప్రభాతవార్త తో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల గురించి జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారి చేసారన్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నుంచి రేణిగుంటలోని మల్లిమడుగు రిజర్వాయర్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించే పథకానికి సంబంధించి వేగం పెంచుటకు కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని మదనగోపాల్ వివరించారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని ప్రతి చెరువుకు సాగునీరందించుటకు ప్రభుత్వం ఆదేశించిందని మదన గోపాల్ అన్నారు. ఈ మేరకు విడుదల చేస్తున్నట్లు మదనగోపాల్ ప్రభాతవార్తకు వివరించారు.



గంగ ఎస్ఇ మదనగోపాల్

## ఆటో బోల్తా : ఇద్దరి పరిస్థితి విషమం



చౌడేపల్లి, నవంబర్ 21 ప్రభాతవార్త : ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలు కాగా వారిలో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా మారింది. గ్రామస్తుల కథనం మేరకు... చౌడేపల్లి-చుక్కావారిపల్లి ప్రధాన రహదారిలో చుక్కావారిపల్లి నుంచి ప్రయాణీకులను తరలించుకొని వస్తున్న ఆటో బాలసముద్రంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చుక్కావారిపల్లికి ఎన్.గంగులమ్మ(65), కె.నీలమ్మ(48), దివ్యాంగురాలు వసంత(34)లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని స్థానికులు చౌడేపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. వారిలో గంగులమ్మ, నీలమ్మల ఆరోగ్య పరిస్థితి విషమంగా వుండటంతో 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## గోకులం షెడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలి : పీడీ



పెద్దపంజాణి నవంబరు21 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులను ప్రోత్సహించేందుకు మంజూరు చేసిన మిని గోకులంషెడ్లనిర్మాణాలను రైతులు త్వరగా నిర్మించుకోవాలని డ్వామ పీడీ ఏ.రవి కుమార్ సూచించారు. గురువారం మండలంలోని బట్టందొడ్డి, మాదనపల్లి గ్రామ పంచాయతీలో ఆయన పర్యటించి నిర్మాణాల్లోఉన్న గోకులంషెడ్లను పరిశీలించారు. మండలానికి 175 గోకులం షెడ్లు మంజూరు కాగా వాటిలో 70 మాత్రమే గ్రౌండింగ్ చేశారని మిగతా వాటిని కూడా వెంటనే ప్రారంభిం చాలని ఆదేశించారు. ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజీ. ఏపిఓ మురుగేషన్, ఇంజనీర్ కన్సల్టెంట్ నాగమణి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలనలో అభివృద్ధి..సంక్షేమం పరుగులు

-ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం మరలా అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు తీస్తోందని ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాంతో కలసి మాట్లాడారు. కుప్పంలో సుస్థిర అభివృద్ధికి సిఎం చంద్రబాబు ఆదేశాలతో విజన్ డాక్యుమెంట్ రూపొందిం చామన్నారు. గతంలో కుప్పంలో ఎయిర్‌పోర్ట్ అంటే నవ్వేవారన్నారు. తాజాగా ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం ఇక్కడ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంకు అనుకూలం అని పేర్కొందన్నారు. కుప్పంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర నేత గోపీనాథ్, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నేతలు రామచంద్ర, ప్రతాప్, చలపతి, హిదయతుల్లా, ప్రకాష్, మోహన్, రవి, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, ఈశ్వర్, అన్నాదొరై, మణి, సుగుణమ్మ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలి

-జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్



తవణంపల్లె, నవంబర్ 21 ప్రభాతవార్త: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండలం లోని పొన్నేడుపల్లెలో జిల్లా అదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డితో కలసి పొన్నేడుపల్లెలో ఆకస్మికంగా పర్యటించి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా జ్వరపీడితులు వున్నారా? అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని అనిల్‌కుమార్ సూచించారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు, సూపర్‌వైజర్లు శ్రీహరి, రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.